# ఘ్రాలు

ఎస్.హన్మంత్రావ్

**బొంబాయిలో పని చేస్తున్న నేను చెల్లెలి పెళ్ళి కోసం రాజమండ్రి వచ్చి వారం అవుతోంది. పెళ్లి హడావుడి కాస్త తగ్గడంతో 'అలా తిరిగొద్దాం' అని రోడ్డు మీదికి వెళ్లాను.**



స్కూటర్ మీద హడావిడిగా వెళుతూ గోపాల్‌గారు కనిపించారు. నేను డిగ్రీ పాసైన కొత్తలో ఆయన నడిపే కాన్వెంట్‌లో టీచర్‌గా పని చేశాను కొన్నాళ్లు. ఆయనకి నేనంటే చాలా అభిమానం. మరుసటి రోజు పాలకొల్లులో వాళ్ల అబ్బాయి పెళ్లి అని చెప్పి, తప్పక రమ్మని ఆహ్వానించారు.

ఆ రాత్రికే ఇంటి దగ్గర్నించి బస్సు బయలుదేరుతున్నదని, పదికల్లా వచ్చేయమన్నారు. సరేనన్నాను. ఉదయం ఎనిమిదికి సుముహూర్తం. తర్వాత భోజనాలు. ముందు బంతిలోనే కూర్చుని, గోపాల్‌గారికి చెప్పి బయట పడ్డాను. ఆ సాయంత్రమే చెల్లెలి శాంతికి రాజమండ్రిలో శోభనం. ఇంటికి పెద్ద కొడుకుగా అలాంటి సమయంలో ఇంట్లో అందుబాటులో వుండటం మంచిదని పెళ్లి వారి బస్సు కోసం ఆగకుండా, మనిషికి పది రూపాయలు చొప్పున తీసుకుంటున్న టాక్సీ ఎక్కి పాలకొల్లు నించి రాజమండ్రి బయలు దేరాను.

టాక్సీ సిద్ధాంతం దగ్గర గోదావరి దాటి రాజమండ్రి వైపు బాగా వేగంగా ప్రయాణిస్తోంది. చల్లగా తగిలే గాలి చాలా హాయిగా వుంది. కారు టేప్ రికార్డర్ నించి వచ్చే పాత కాలపు పాటలు మనసుని ఉల్లాసపరుస్తున్నాయి. డ్రైవర్ పక్కనే కూర్చున్నాను. నా దృష్టి రోడ్డు పక్కన అక్కడక్కడా నిలబడి కనకాంబరం దండల్ని, కారుని ఆపమన్నట్టు ఊపుతున్న కుర్రాళ్ల మీద పడింది. ఎర్ర జెండా ఊపి రైలుని ఆపినట్టు- ఇదేదో సింబాలిక్‌గా అనిపించి ముచ్చటేసింది.

నా ఆసక్తిని క్రీగంట గమనించిన డ్రైవర్ "కొంటారా సార్!.... డెడ్ చీప్" అన్నాడు.

నాకు హఠాత్తుగా శాంతికి ఆ రాత్రికే శోభనం అన్న సంగతి గుర్తుకొచ్చింది. 'ఎలానూ ఈ రోజు పూల అవసరం తప్పదు- పైగా చౌక అంటున్నాడు. కొని పట్టికెళితే సరి.... టాక్సీ ఆపమన్నాను. టాక్సీ డ్రైవరే ఉత్సాహంగా బేరమాడి కారుచౌకగా కొన్నాడు. రెండు బుట్టల మల్లెలు, ఒక బుట్ట కనకాంబరాలు, రంగు రంగుల గులాబీలు, పచ్చటి చామంతులు, సంపెంగలు, దవనం... తీసుకున్నాను. బొంబాయి రేట్లతో బేరీజు వేసుకున్న నాకు చాలా ఆనందమనిపించింది.

బుట్టలతో ఇంటి కొచ్చిన నన్ను అంతా చుట్టేశారు.

"చెల్లెలంటే ఎంతిష్టమో రాంబాబుకి" పిన్ని మురిపెంగా అంది.

"ఎంత అయ్యింది?.... నూట యాభైయో.... రెండొందలో... అయ్యుంటుంది!" ....ఖర్చుని అంచనా వేస్తూ అంది అత్త.

"ఎక్కడ కొన్నావు... డీలక్స్ సెంటర్లోనా?" అడిగారు నాన్న. నేను వినీ విననట్టు ఊరుకున్నా. పాలకొల్లు నించి వస్తూ కొన్నానని చెప్ప బుద్ధి కాలేదు. వాళ్లంతా పూలని టౌన్లోనే కొన్నానని అనుకుంటున్నారు. ఇక్కడి ధరలని లెక్కేసుకుని నేను పెట్టిన ఖర్చుని అంచనా వేస్తున్నారు. ఇప్పుడు దేన్నైనా కొలిచే స్కేలు డబ్బేనన్న సంగతి నాకు తెలియంది కాదు.

ఎప్పుడు వచ్చిందో గాని మా ఆవిడ నన్ను కోపంగా చూడసాగింది. "మిగతా అన్నలు పెళ్లి ఖర్చుల్ని పూర్తిగా తండ్రి మీద వదిలేసి, జేబులోంచి పైసా తీయకుండా జాగ్రత్తగా మేనేజ్ చేస్తుంటే, గొప్ప కోసం అంత ఖర్చు పెట్టి అన్ని పువ్వులు తేవడం ఎందుకు?''... అన్న భావం ఆ చూపుల్లో చదువుకున్నాను. అయితే అది కొద్ది సేపే. అంతా నన్ను తెగ పొగుడుతుంటే మా ఆవిడకీ తన భర్తకి లభించిన ప్రత్యేకమైన ఆ క్రెడిట్‌కి సంబరం కలిగి నన్ను ప్రేమగా చూసింది. అంతే కాదు రాత్రి వరకు పూలు వాడకుండా నీళ్ళు చల్లడంలాంటి ఏర్పాట్లన్నీ తనే చూసుకుంది.

రాత్రి శోభనం గదిని అలంకరించేప్పుడు అమ్మలక్కలంతా నన్ను ఒకటే మెచ్చుకోవడం నాకు వినిపిస్తూనే వుంది. ఆ మాటలు వింటూ అంత హడావుడిలోనూ నా వైపు ప్రేమ దృక్కులు సారిస్తూనే వుంది మా ఆవిడ.

దంపతి తాంబూలాల్లాంటి తంతు ముగిశాక, ఇక ఇంట్లో పడుకునేందుకు జాగా ఇబ్బంది కాబట్టి, మగాళ్లంతా దగ్గర్లోని బంధువులిళ్ళకో, మిత్రులిళ్ళకో జారుకున్నాం. నేను రాత్రి మా ఫ్రెండ్ భాస్కర ప్రసాద్ ఇంట్లో పడుకుని, తెల్లారి లేచి ఇంటి కొచ్చే సరికి గుమ్మంలోనే ఎదురైంది మా ఆవిడ.

"చూశారా ఆ అబ్బాయి ఏం చేశాడో?" అని ఆగింది. ఆ అబ్బాయి అంటే పెళ్లికొడుకని నాకు అర్థమై, ఆత్రుతగా ఏమిటన్నట్టు చూశాను.

"మీరంత ప్రేమగా అన్ని పూలు అంత ఖరీదు పెట్టి తెచ్చారా?.... మేమంతా శ్రమపడి అంత అందంగా గదిని అలంకరించామా?..... కాని వాటిని పూర్తిగా తీసేసే వరకు ఒప్పుకోలేదట అతను. తలుపు వేశాక బలవంతం చేసి మీ చెల్లెలి చేత పూలని పూర్తిగా తీసేయించే వరకు ఊరుకోలేదట. తర్వాత ఇద్దరూ కలసి వాటిని దొడ్డి తలుపు తీసి బయటికి విసిరేశారట. పూలుంటే మూడ్ రావడం లేదన్నాడట" అంది, కొంచెం వెటకారంగా నవ్వుతూ.

నాకు అర్థమైంది. వాళ్ళకి హైదరాబాద్ జాంబాగ్‌లో పూల వ్యాపారం వుంది. బహుశా అన్ని పూలు అలంకరించిన మంచం మీద కూర్చుంటే... కొట్లో కూర్చున్నట్టే అనిపించి వుంటుంది పాపం అతనికి... నేనూ నవ్వుకున్నాను. ⊙

## బాలీవుడ్ బాణీ

### అమీర్‌కు తెలిసిన మరో విద్య



సినిమాలలో వేషాలు లేకపోవడంతో అమీర్‌ఖాన్ రకరకాల వ్యాపకాలు మొదలెట్టాడు. తాజాగా అతను డ్రమ్స్ నేర్చుకుంటున్నాడు. ఇదెందుకని మీకు అనుమానం రావొచ్చు. కాని అమెరికాలో త్వరలో ఇవ్వనున్న 'స్టేజ్ షో'లో- అమీర్ డ్రమ్మర్ అవతారం ఎత్తుతున్నాడు. దీని కోసం ప్రతి రోజూ గంటల తరబడి ప్రాక్టీస్ కూడా చేస్తున్నాడు. 'కొత్త విషయాలు నేర్చుకోవాలని నేను చాలా ఉబలాపడుతున్నానని''అని స్టేట్‌మెంట్ కూడా ఇచ్చాడు. అయిదు నిముషాల 'స్టేజ్ షో' కోసం ఇంత శ్రమ పడుతున్నాడంటే, అతని దీక్షను మెచ్చుకోవలసిందే!

మసూద్ అన్సారి